సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



ఇష్టంగా లాగిస్తున్నాం
సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తి పెంచేందుకు ప్రభుత్వం రాగిజావ అందిస్తోంది. 8లో



సర్వే అడ్డగింత
ఇల్లెందులో చేపడుతున్న జేకే ఓసీ ప్రభావిత ప్రాంతంలో సింగరేణి అధికారులు చేపట్టిన సర్వేను నిర్వాసితులు అడ్డుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పార్లమెంటరీ ఆర్థిక కమిటీ సభ్యుడిగా ఎంపీ నామ

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంటరీ ఆర్థిక కమిటీ సభ్యులుగా బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు నియమితులయ్యారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయనను నియమిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మందితో ఏర్పాటైన ఈ కమిటీలో సభ్యుడైన ఎంపీ నామ పలు ఆర్థిక అంశాలపై ఆర్థిక కమిటీకి సూచనలు ఇచ్చే అవకాశముంటుంది. ఆయన నియామకంపై ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జీవనోపాధికి చేయూత

ఐటీసీ డీసీఎం చెంగలరావు



మహిళలకు తోపుడు బండ్లు అందిస్తున్న ఐటీసీ అధికారులు

బూర్గంపాడు: నిరుపేద ఒంటరి మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు చేయూతనందిస్తున్నట్లు ఐటీసీ పీఎస్‌పీడీ డిప్యూటీ చీఫ్ మేనేజర్(హెచ్‌ఆర్) చెంగలరావు అన్నారు. శనివారం బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లోని 1000 మంది నిరుపేద ఒంటరి మహిళలకు, వితంతువులకు ఐటీసీ, బంధన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జీవనోపాధుల సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద మహిళల జీవనోపాధి మెరుగు పడేందుకు ఆర్థిక చేయూతతో పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజ్‌కుమార్, సర్పంచ్‌లు తుపాకుల రామలక్ష్మి, కె.పుల్లారావు, కె.లక్ష్మి, పి. సూరమ్మ, ఐటీసీ ఎంఎస్‌కే పీఎం జయప్రకాశ్, సుమిత్ర రాయ్ పాల్గొన్నారు.

గద్దర్, జహీర్ స్మారక సదస్సుకు తరలిరావాలి



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం నిర్వహించే గద్దర్, జహీర్ అలీ స్మారక స్ఫూర్తి సదస్సుకు ప్రజాస్వామ్య, లౌకిక వాదులు, మేధావులు తరలిరావాలని నిర్వాహకులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుది శ్వాసవరకు ప్రజలను చైతన్యవంతం చేస్తూ, దోపిడీ, పీడనలపై ప్రశ్నించే, నిలదీసేతత్వాన్ని నేర్పిన మహోన్నత వ్యక్తులు గద్దర్, జహీర్ అని పేర్కొన్నారు. సదస్సుకు ప్రొఫెసర్లు కోదండరాం, కాశీం, కంచె ఐలయ్య, బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, గాయకులు జయరాజ్, అందె శ్రీ, తెలంగాణ ఉద్యమ కారుడు పాశం యాదగిరి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క, కూనంనేని సాంబశివరావు, పోతినేని సుదర్శన్, సాధినేని వెంకటేశ్వరరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సులో కళాకారులతో ఆటాపాట కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సదస్సు నిర్వాహకులు ఎస్‌కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, జేబీ శౌరీ, తాళ్లూరి వెంకటేశ్వరరావు, మల్లెల రామనాథం తదితరులు పాల్గొన్నారు.

మరో ముందడుగు!

విస్తరణ బాటలో భద్రాచలం పేపర్ బోర్డ్
- ల్యాండ్ బ్యాంక్‌పై దృష్టి పెట్టిన ఐటీసీ
- అమ్మకానికి వచ్చిన కమలాపురం బిల్ట్ స్థలాలు
- క్షేత్రస్థాయిలో ప్రారంభమైన సర్వే పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పేపర్ పరిశ్రమ (పేపర్ బోర్డ్, స్పెషాలిటీ పేపర్ డివిజన్)లో ఎనిమిదో యూనిట్‌ను స్థాపించే పనిలో ఐటీసీ ఉంది. దీంతో పాటు భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ల్యాండ్ బ్యాంక్ సమీకరణపై దృష్టి సారించింది. ఈ క్రమంలో మూతపడిన బిల్ట్ (ఏపీ రేయాన్స్) కర్మాగారానికి చెందిన స్థలాలను కొనుగోలు చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ పనులు మరింత వేగంగా ముందుకు సాగుతున్నాయి.

మూతపడిన బిల్ట్..
ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో 1970వ దశకంలో ఏపీ రేయాన్స్ పేరుతో పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఈ పరిశ్రమ పేరు బిల్ట్‌గా మారింది. మూడు దశాబ్దాలకు పైగా పేపర్ పల్ప్‌ను ఉత్పత్తి చేసిన ఈ సంస్థ 2014లో మూత పడింది. ఆ రోజుల్లో ఈ పరిశ్రమ స్థాపనకు ఇంచుమించు 500 పైగా ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. గడిచిన ఎనిమిదేళ్లుగా ఫ్యాక్టరీ మూతపడి ఉండటంతో ఇక్కడున్న యంత్రాలు ఎందుకూ కొరగాకుండా పోయాయి. విలువైన పరికరాలు అపహరణకు గురయ్యాయి.

టేకోవర్‌కు ప్రయత్నం..
ఐటీసీ సంస్థకు భద్రాచలంలో ఉన్న పేపర్ బోర్డ్ యూనిట్ లాభాల్లో ఉంది. దీంతో ప్లాంట్ విస్తరిస్తూ పోతోంది. ఈ క్రమంలో ఎనిమిదో యూనిట్‌ను స్థాపించేందుకు ఇటీవల ప్రయత్నాలు ముమ్మరం చేయగా స్థల లభ్యత సమస్య ఎదురైంది. దీంతో ఉద్యోగుల క్వార్టర్లను తొలగించి ఆ స్థానంలో కర్మాగారం నిర్మిస్తోంది. అయితే భవిష్యత్ అవసరాల కోసం బిల్ట్ భూములను కొనుగోలు చేయడం మేలనే భావనతో ఐటీసీ యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని కంపెనీ వర్గాలు అంటున్నాయి. బిల్ట్ పరిశ్రమలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న భూముల వాస్తవ పరిస్థితి ఏంటని తెలుసుకునేందుకు ఐటీసీ యాజమాన్యం ములుగు జిల్లా రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు చేస్తోంది. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో భూముల హద్దులు నిర్ణయించేందుకు ఎఫ్ లైన్ సర్వే చేయాలని ఐటీసీ యూనిట్ నుంచి రెవెన్యూ శాఖకు ఇటీవల దరఖాస్తు చేశారు.





ములుగు జిల్లా కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ (ఇన్‌సెట్) ఎఫ్ లైన్ సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అమ్మకానికి ఆస్తులు
బిల్ట్ పరిశ్రమకు అప్పులు ఇచ్చిన బ్యాంకర్లు, ఫైనాన్షియర్లు రికవరీ కోసం సంస్థపై ఒత్తిడి తెచ్చారు. అంతేకాదు.. అక్కడ పని చేసిన కార్మికులు, ఉద్యోగులు వేతన బకాయిల కోసం యాజామాన్యానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చివరకు ఫ్యాక్టరీకి చెందిన ఆస్తులు అమ్మి బకాయిలు చెల్లించాల్సిందిగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఏడాదిన్నర కాలంగా బిల్ట్‌కు చెందిన ఆస్తుల అమ్మకం ప్రక్రియ కొనసాగుతోంది. కమలాపురంలో బిల్ట్ సంస్థకు మొత్తంగా 500 ఎకరాల భూమి ఉంది. ఇందులో మూడు వందల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీ, ఉడ్ యార్డులు ఉండగా, రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో కార్మికులు, ఉద్యోగుల కోసం కేటాయించిన కాలనీ ఉంది. బిల్ట్‌కు చెందిన స్థలాలను కొనుగోలు చేసేందుకు ఐటీసీ సంస్థ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఎఫ్ లైన్ సర్వే
ఐటీసీ సంస్థ అభ్యర్థనతో రంగంలోకి దిగిన ములుగు జిల్లా రెవెన్యూ సిబ్బంది గత మూడు రోజులుగా బిల్ట్ పరిశ్రమ విస్తరించిన కమలాపురంలో క్షేత్రస్థాయి సర్వే చేపడుతున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం బిల్ట్ పరిశ్రమకు 1970వ దశకంలో మూడు సర్వే నంబర్లలో 500 ఎకరాల స్థలం కేటాయించారు. ఇందులో సంస్థ ఉపయోగించుకున్న భూముల వివరాలు, ప్లాంట్ నిర్మాణం, క్వార్టర్ల నిర్మాణం, ఉడ్‌యార్డుల నిర్మాణం కోసం ఏ సర్వే నంబర్లలో ఎంత స్థలం వినియోగం అయింది.. ఎక్కడైనా స్థలాలు కబ్జాకు గురయ్యాయా ? అనే అంశాలు ఈ సర్వేలో తేలనున్నాయి. సర్వే రిపోర్టు ఆధారంగా ఐటీసీ నిపుణుల బృందం మరింత లోతుగా భూముల కొనుగోలు అంశంపై మదింపు చేయనుంది.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

- 'పోషణ్ అభియాన్'లో కలెక్టర్ ప్రియాంక ఆల
- కొత్తగూడెం క్లబ్‌లో గర్భిణులకు సీమంతం



సీమంతం అనంతరం గర్భిణులతో కలెక్టర్ ప్రియాంక, విజేత, ఇతర అధికారులు

కొత్తగూడెంటౌన్: తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో శనివారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం చేశారు. తల్లీ పిల్లలకు పోషకాహారం పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ వయసులో ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, గర్భిణులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. క్రిమి సంహారక మందుల నుంచి రక్షించుకునేందుకు కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విటమిన్ సీ శరీరానికి ఎంతో అవసరమని చెప్పారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ.. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'హెల్దీ ఇండియా – హెల్దీ ఫ్యామిలీ' కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు తల్లులు, పిల్లలు రావాల్సిన అవసరం లేకుండా అంగన్‌వాడీ టీచర్లే వారి ఇంటికి వెళ్లి పోషకాహారం అందించేలా కార్యక్రమాలు రూపొందించామని చెప్పారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలతో రూపొందించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అనసూయ, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, డీఐఈఓ సులోచనారాణి, కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి
సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ప్రభుత్వానికి ఆదాయం పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని గోదావరి, కిన్నెరసాని నదులకు సంబంధించి ఆయా మండలాల్లో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ల ద్వారానే ర్యాంప్‌లు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం విక్రయించాలని చెప్పారు. రీచ్‌ల్లో ఇసుక లభ్యత, నిల్వలపై తనిఖీ చేసి నివేదిక అందజేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి పోలీస్, మైనింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఒకే కూపన్ ద్వారా లెక్కకు మించి తరలిస్తుంటారని, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల నిఘాతో వాహనాలు తనిఖీ చేయాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలకు ఇసుక కొరత ఏర్పడొద్దని స్పష్టం చేశారు.

డిమాండ్ ఉన్న పంటలే సాగు చేయాలి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న అన్నారు. జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో కూరగాయల క్షేత్రాలను, నర్సరీలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వంగ, టమాట, కాకర, బీర, సొర, మునగ, కరివేపాకు, పుదీనా, ఆకుకూరలు, క్యాబేజీ, కాలిఫ్లవర్, క్యారెట్, బీట్రూట్, బోడ కాకర, తీగల్ గార్డ్, బంతి, చామంతి, ఆస్టర్, మల్లె, కనకాంబరం, లిల్లీ తదితర పంటలు సాగుచేయాలని సూచించారు. రైతులు మేలైన రకాలను ఎంచుకుని శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలన్నారు.

ఏ ఒక్కరూ ఆనందంగా లేరు

- నిరుద్యోగులు, పోడు రైతులపై చిన్నచూపు
- బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకూ న్యాయం
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మణుగూరులో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మణుగూరు టౌన్: సీఎం కేసీఆర్ పాలనలో నిరుద్యోగులు, పోడు రైతులు, విద్యార్థులు.. ఇలా ఏ ఒక్క వర్గం వారూ ఆనందంగా లేరని బీజేపీ రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మణుగూరులో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర పాలకులతో రాష్ట్రం వెనకబడిందని, తాను అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తానని చెప్పిన కేసీఆర్.. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తెలంగాణ వచ్చి పదేళ్లు కావస్తున్నా పేద, మధ్య తరగతి వర్గాల వారు బాగుపడలేదన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, 50 ఏళ్లకు పింఛన్ వంటి హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రతీ ఇంట్లో డిగ్రీలు పూర్తయిన పిల్లలున్నా ఉద్యోగం రాలేదన్నారు. 17 సార్లు పరీక్ష పెట్టి పేపర్ లీకులతో పిల్లల జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. పోడు సాగు చేస్తున్న రైతులను అధికారులు ఇబ్బంది పెడుతూ భూములు లాక్కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని, కల్యాణలక్ష్మి చెక్కును పెళ్లిపందిరిలోనే అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులు పండించే అన్ని పంటలను కేజీ కూడా తరుగు లేకుండా తీసుకుంటామన్నారు. మెరుగైన విద్య, వైద్యం అందిస్తామని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. కౌలు రైతులనూ ఆదుకుంటామన్నారు. అంతకుముందు కొత్తగూడెంలోనూ విలేకరులతో మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రంగరాజు రుక్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.రంగాకిరణ్, ఎస్టీ నియోజకవర్గాల చైర్మన్ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, కూన శ్రీశైలం గౌడ్, బీఎంఎస్ నాయకులు మాధవనాయక్, నాళ్ల సోమసుందర్, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్, ఎడ్లపల్లి శ్రీనివాసరావు, ఆకుల నాగేశ్వరరావు, రవీందర్, రాయుడు నాగేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్న జడ్జి



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న జడ్జి భానుమతి

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారిని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భానుమతికి ఆలయ పూజారి, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఆమె స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జిని కమిటీ సభ్యులు సన్మానించారు.

సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలి
సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందున్నా కొన్నిచోట్ల వివక్షకు గురవుతున్నారని భానుమతి అన్నారు. పడమట నర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లింగ సమానత్వం పాటించడంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బాల్య వివాహాలు నేరమని, 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ క్రీడా కార్యదర్శి పిట్టల రామారావు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పురుషోత్తంరావు, డిప్యూటీ కౌన్సిల్ నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ, గాదే సునంద, మెండు రాజమల్లు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, జూలూరుపాడు సీఐ పెద్దన్నకుమార్, ఎస్‌ఐ పురుషోత్తం, హెచ్‌ఎం సుభద్ర పాల్గొన్నారు.

పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలి
పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతాలను సందర్శించే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి అన్నారు. కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని శనివారం ఆమె సందర్శించారు. అనంతరం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలపై అవగాహన కల్పించారు. పర్యాటక ప్రాంతాలకు మహిళలు, చిన్నారులతో వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పురుషోత్తం, అంబేద్కర్, నిరంజన్‌రావు, మెండు రాజమల్లు, పిట్టల రామారావు పాల్గొన్నారు.

శ్రమ.. కష్టార్జితం బూడిదపాలు

- గ్రూప్–1 పరీక్ష రద్దుతో నిరుద్యోగుల ఆవేదన
- ప్రభుత్వ తప్పిదానికి తమను బలి చేయొద్దని వేడుకోలు
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసిన 16,203 మంది



పాల్వంచలో గ్రూప్–1 పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: తల్లిదండ్రులు చెమట చిందించి సమకూర్చిన డబ్బుతో శిక్షణ తీసుకుంటూ అభ్యర్థులు నిద్రాహారాలు మాని చదువుకుని పరీక్ష రాసి రేపో, మాపో ఫలితాలు వెల్లడవుతాయని, ఉద్యోగం వస్తుందని ఆశిస్తుండగా... గ్రూప్–1 పరీక్షను రద్దు చేయాలని కోర్టు తీర్పునివ్వడం వారికి అశనిపాతంలా మారింది. గతంలోనూ ఓసారి పరీక్ష రద్దు కాగా మళ్లీ సిద్ధమై రాశామని.. ఇప్పుడు కూడా రద్దు చేయడంతో పరీక్షకు సిద్ధం కావడం తమకు తలకు మించిన భారంలా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇక కొందరు వయోపరిమితి దాటుతుండడంతో పరీక్ష రాయగలమా, రాసినా ఉద్యోగం సాధించగలమా అనే మీమాంసతో ఆవేదన అనుభవిస్తున్నారు.

రద్దు చేయండి...
ఈ ఏడాది జూన్ 11న గ్రూప్–1 పరీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 531 పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించగా ఖమ్మం జిల్లాలోని 50 కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న 17,365 మంది అభ్యర్థులకు గాను 10,945 మంది హాజరయ్యారు. ఇక భద్రాద్రి జిల్లాలోని 22 కేంద్రాల్లో 8,851 మందికి 5,258 మంది పరీక్ష రాశారు. అయితే, పరీక్ష సందర్భంగా అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయలేదని, ఓఎంఆర్ షీట్లపై హాల్‌టికెట్ నంబర్, అభ్యర్థుల ఫొటో ముద్రించలేదని చెబుతూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది. కాగా, గతంలోనూ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు చేయడంతో రెండో సారి నిర్వహించినా టీఎస్‌పీఎస్ తీరుతో మళ్లీ పరీక్ష కోల్పోయామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది ప్రభుత్వ తప్పిదమే...
గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు కావడానికి ప్రభుత్వ తప్పిదమే కారణమని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి రూ.లక్షలు వెచ్చించి శిక్షణ తీసుకుని పరీక్షకు సిద్ధమైతే చివరకు నిరాశే మిగిలిందని చెబుతున్నారు. ఈ సారి పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు ఉద్యోగం వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఇంతలోనే పరీక్ష రద్దు చేయడం, మళ్లీ సిద్ధం కావాలంటే డబ్బుకు తోడు సమయం వెచ్చించాల్సి రావడం భారంగా మారుతుందని అంటున్నారు. కారణాలు ఏవైనా పరీక్ష రద్దు చేయడం, మళ్లీ రాయాల్సి వస్తుండం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్ నిర్లక్ష్యానికి నిదర్శమని విమర్శిస్తున్నారు. ముందే జాగ్రత్తలు తీసుకుంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని వాపోతున్నారు.

సమయం వృథా అయినట్లే



గ్రూప్–1 పరీక్ష రాసిన పలువురు ఉద్యోగం వస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఇప్పుడు పరీక్ష రద్దు కావడంతో ఆందోళన చెందుతున్నాం. చాలామందికి వయోపరిమితి దాటనుంది. అంతేకాక మళ్లీ శిక్షణకు డబ్బు వెచ్చించే పరిస్థితి పలువురికి లేదు. మళ్లీ రాయాలంటే లైబ్రరీలకు పరుగులు తీయాల్సిందే.
– జి.మృదుల, కొత్తగూడెం

ఎవరు బాధ్యత వహిస్తారు?



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. నేను గ్రూప్–1 కోసం 2015 నుంచి సిద్ధమవుతున్నా. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో శిక్షణ కోసం రూ.లక్షల్లో వెచ్చించా. ఇప్పుడు పరీక్ష మళ్లీ రాయాలంటూ శిక్షణకు డబ్బు వెచ్చించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలి.
– ఏ.సునీత, కొత్తగూడెం

రూ.2లక్షలు, రెండేళ్ల సమయం కోల్పోయినట్లే..



రెండేళ్లుగా రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టి శిక్షణ తీసుకున్నా. ఇంత కష్టపడి పరీక్ష రాస్తే రద్దు చేయడంతో శ్రమ, డబ్బు కోల్పోయినట్లే. ఈసారి పరీక్ష బాగా రాశాననే నమ్మకంతో మంచి మార్కులు వస్తాయని అంచనా వేశాను. పరీక్ష రద్దుతో నాకే కాదు అభ్యర్థులందరికీ నష్టం జరిగినట్లుగానే భావించాలి.
– బి.రవి, కొత్తగూడెం

'లక్ష్మీ' గణపతి..



ములకలపల్లి ప్రధాన సెంటర్‌లోని మండపంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని భక్తులు శనివారం 'లక్ష్మీ గణపతి'గా అలంకరించారు. రూ. మూడు లక్షల విలువైన నోట్లతో ఏకదంతుడిని సుందరంగా తీర్చిదిద్దారు. కాగా, పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేస్తున్నారు.
– ములకలపల్లి

క్లుప్తంగా

వైభవంగా శ్రీ బాలాజీ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'మన బడి' పనులు పరిశీలన



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి: మండల పరిధిలోని పూసుగూడెం ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులను శనివారం విద్యాశాఖ అధికారులు ఎస్కే సైదులు, నాగరాజు సందర్శించారు. వాటర్‌ట్యాంకు, ప్రహరీ, తరగతి గదుల మరమ్మతులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ పక్కాగా అమలు చేయాలని సూచించారు. అనంతరం పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొని తల్లిదండ్రుల సలహాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం రామకోటమ్మ పాల్గొన్నారు.

మిరప పంటకు గుబ్బతెగులు



మిరప మొక్కలను తొలగిస్తున్న రైతులు

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామంలో మిరప పంటకు గుబ్బతెగులు సోకింది. గురువాగుతండాకు చెందిన రైతు భూక్యా నరసింహా కాకర్ల గ్రామంలో 5 ఎకరాల కౌలు భూమిలో మిరప సాగు చేపట్టాడు. తెగులు నివారణకు ఎరువులు, మందులు వాడినా ఫలితం లేదు. దీంతో శనివారం తెగులు సోకిన మిరప మొక్కలను తొలగించారు. మళ్లీ కొత్తగా మొక్కలు నాటుతున్నారు. ఐదెకరాలకు కౌలు రూ.1.75 లక్షలు, పెట్టుబడి రూ.2.50 లక్షల ఖర్చయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అత్యవసరంగా మున్సిపల్ కౌన్సిల్ భేటీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ అత్యవసరంగా సమావేశమైంది. చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎజెండాలోని రెండు అంశాలను చర్చించి ఆమోదించారు. పాతకొత్తగూడెంలోని ప్రభుత్వ స్థలం పంపిణీ చేసే కార్యక్రమం కొత్తగూడెం క్లబ్‌లో జరగనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి అయ్యే ఖర్చు రూ.5 లక్షలు జనరల్ ఫండ్ నుంచి కేటాయించేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. రైతుబజార్‌లోని నూతనంగా నిర్మాణమైన షెడ్ల ప్రారంభోత్సవంపై చర్చించి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కమిషనర్ రఘు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల పాలై ఆత్మహత్య

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తికి చెందిన బోడా రామకృష్ణ (34) ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతూ డబ్బు పోగొట్టుకుని అప్పులు పెరగడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిత్యం ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడే రామకృష్ణ తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. కుటుంబ సభ్యులు మందలించినా మార్పు రాకపోగా, అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో శుక్రవారం గ్రామ సమీపాన గడ్డిమందు తాగి పడిపోగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామకృష్ణ శనివారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

గడ్డి మందు తాగి..

చింతకాని: చినమండవకు చెందిన నాగారపు వెంకటనారాయణ (55) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా ఆయన కడుపునొప్పితో బాధపడుతూ తాళలేక మద్యం సేవిస్తున్నాడు. శుక్రవారం కూడా కడుపునొప్పి రావడంతో గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026



యానంబైలు హైస్కూల్‌లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు

ఎంతో ఇష్టంగా లాగిస్తున్నాం..

పాఠశాలల్లో పంపిణీ చేస్తున్న బెల్లం రాగిజావపై విద్యార్థుల మనోగతం

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెంచాలనే ఉద్దేశంతో బెల్లంతో తయారు చేసిన రాగిజావను ప్రభుత్వం అందిస్తోంది. నూతన విద్యా సంవత్సరం నుంచి సర్కారు బడుల్లో వారానికి మూడుసార్లు రాగిజావ, మూడు రోజులు కోడిగుడ్లను అందించే ప్రక్రియ కొనసాగుతోంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు బెల్లం పౌడర్, రాగిపిండిని కలిపి వేడిచేసి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పంపిణీ చేస్తున్నారు.



రాగిజావ

ప్రయోగాత్మకంగా చేపట్టిన రాగిజావను విద్యార్థులు ఇష్టంగా సేవిస్తున్నారు. కొత్త మెనూలో

మండలం	పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు
పాల్వంచ	107	7,715
కొత్తగూడెం	30	3,132
పినపాక	72	2,139
సుజాతనగర్	43	2,483
టేకులపల్లి	109	3,987
ఇల్లెందు	131	5,029
ములకలపల్లి	88	3,289
మణుగూరు	72	2,883
లక్ష్మీదేవిపల్లి	67	2,637
అన్నపురెడ్డిపల్లి	38	1,779
ఆళ్లపల్లి	40	953
భద్రాచలం	21	1,865
అశ్వారావుపేట	111	4,844
బూర్గంపాడు	57	3,398
చంద్రుగొండ	47	2,843
చర్ల	103	4,130
చుంచుపల్లి	30	1,903
దమ్మపేట	117	4,824
దుమ్ముగూడెం	114	3,575
గుండాల	51	1,629
జూలూరుపాడు	63	3,059
కరకగూడెం	45	999

రాగిజావ పంపిణీ చేస్తున్న పాఠశాలలు

రాగిజావతోపాటు అల్పాహారాన్ని కూడా దసరా నుంచి అందించాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసినా మార్గదర్శకాలు రాలేదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

మంచిగనిపిస్తోంది..



స్కూల్‌కు రాగానే బెల్లంతో కూడిన రాగిజావను పోస్తున్నారు. ఇది తాగడం మంచిగనిపిస్తోంది. వారానికి మూడుసార్లు మాత్రమే ఇస్తున్నారు. రోజూ రాగిజావ ఇస్తే బాగుటుంది.

– సీహెచ్ నక్షత్ర, 4వ తరగతి

ఇష్టంగా తాగుతున్నా



స్కూల్లో ఇస్తున్న రాగిజావ ఇష్టంగా తాగుతున్నా. ఇలా వారంలో మూడుసార్లు మాత్రమే పోస్తున్నారు. ఇలాగే రోజు ఇస్తే బాగుటుంది. మరో మూడురోజులు కోడిగుడ్లు పెడుతున్నారు.

– ఎస్‌కే సమీర, 5వ తరగతి

1,622 స్కూళ్లకు అందిస్తున్నాం



జిల్లాలో ఈ విద్యాసంవత్సరం నుంచి 1,622 స్కూళ్లలో 71,992 మంది విద్యార్థులకు బెల్లం, రాగిపొడిని మిక్స్ చేసిన రాగిజావను వారానికి మూడు రోజులు ఇస్తున్నాం. మరో మూడు రోజులు కోడిగుడ్లను అందిస్తున్నాం. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. అల్పాహారాన్ని కూడా త్వరలో అమలు చేస్తాం.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

సర్వేను అడ్డుకున్న నిర్వాసితులు

తిలక్‌నగర్‌ను నిర్వాసిత ప్రాంతంగా గుర్తించాలని ఆందోళన



అధికారుల తీరును నిరసిస్తూ బైఠాయించిన తిలక్‌నగర్ ప్రజలు

ఇల్లెందురూరల్: నూతనంగా చేపడుతున్న జేకే ఓసీ ప్రభావిత ప్రాంతంలో శనివారం సింగరేణి అధికారులు చేపట్టిన సర్వేను నిర్వాసితులు అడ్డుకున్నారు. మండలంలోని తిలక్‌నగర్ గ్రామస్తులు తొలుత విలేకరుల సమావేశం నిర్వహించి తమ ఆవేదన వెలిబుచ్చారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా ఓసీ ప్రభావిత ప్రాంతమని చెబుతూ ఇళ్లకు కనీసం మరమ్మతులు కూడా చేసుకోకుండా సింగరేణి అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. తమ గ్రామం అంచున నిర్వాసిత ప్రాంత సరిహద్దు ఏర్పాటు చేశారని, తమ గ్రామం నిర్వాసిత ప్రాంతంలో లేదని చెబుతున్నారని వాపోయారు. ఓసీలో చేసే బ్లాస్టింగ్ వల్ల తమ ఇళ్ల కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల పక్ష కమిటీ కూడా తమకు న్యాయం చేయడం లేదన్నారు. అదేసమయంలో విజయలక్ష్మినగర్‌లో అధికారులు సర్వే నిర్వహిస్తుండగా వెళ్లి అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న అఖిల పక్ష కమిటీ ప్రతినిధులు, తిలక్‌నగర్ ప్రజలకు మధ్య వాగ్వాదం నెలకొంది. సమస్యలపై చర్చించాకే సర్వే చేస్తారంటూ పోలీసులు నచ్చజెప్పి తిలక్‌నగర్ ప్రజలను పంపించారు. కొద్దిసేపటికే తిరిగి సర్వే ప్రారంభం కాగా, తిలక్‌నగర్ ప్రజలు మళ్లీ వెళ్లి అడ్డుకున్నారు. తిలక్‌నగర్ సర్పంచ్ ధనసరి ప్రవంతి, తదితరులు అధికారులను నిలదీశారు. అక్కడే బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో సింగరేణి అధికారులు సర్వే నిలిపివేసి తిరిగి వెళ్లిపోయారు.

'పెద్దమ్మగుడి' టెండర్లు వాయిదా

రెండు దుకాణాలకే వేలం ఖరారు



వేలంపాటలో టెండర్ వేస్తున్న మహిళ

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయం వద్ద శనివారం 11 వ్యాపార దుకాణాలకు టెండర్ నిర్వహించగా, 6, 8వ నంబర్ షాపులకే వేలంపాట ఖరారైంది. మిగిలిన 9 షాపులకు వ్యాపారులెవరూ ముందుకు రాకపోవడం టెండర్‌ను వచ్చే నెల 3వ తేదీకి వాయిదా వేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు బైలెసింగ్, దేవస్థానం ఈఓ ఎన్.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సమక్షంలో శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) గుడి సమదాయంలోని 11 వ్యాపార దుకాణాలకు, చీరలకు టెండర్ కం వేలంపాట నిర్వహించారు. ఆరో నంబర్ షాపునకు ముగ్గురు పోటీపడగా పాల్వంచకు చెందిన బి.నాగలక్ష్మి రూ.19,500కు దక్కించుకుంది. 8వ నంబర్ షాపునకు ముగ్గురు పోటీపడగా జగన్నాథపురానికి చెందిన జి.రాజేశ్వరి రూ.26,500కు దక్కించుకుంది. చీరల పాటకు నలుగురు పోటీపడగా సీతానగర్ కాలనీకి చెందిన సీహెచ్ వెంకన్న రూ.80,000కు దక్కించుకున్నాడు. 1,2,3,5,7,9,10,11,12 షాపుల కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలంపాట వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతానాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

శ్రీకనకదుర్గ ఆలయంలో ఈ నెల 25న ఉదయం 9 గంటల నుంచి హుండీ కానుకల లెక్కింపు జరపనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కామేపల్లి ఆర్‌ఐ సస్పెన్షన్

కామేపల్లి: కామేపల్లి ఆర్‌ఐ–2గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. పెనుబల్లి మండలం ఆర్‌ఐగా విధులు నిర్వర్తించిన సమయాన అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో అధికారులు ఆయనపై విచారణ జరిపారు. ఈమేరకు అందిన నివేదికతో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన నిఘా



మాట్లాడుతున్న సీపీ విష్ణు ఎస్.వారియర్, పక్కన ఏపీ, తెలంగాణ అధికారులు

- ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్
- ఏపీ, తెలంగాణ అధికారులతో సమీక్ష

సత్తుపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే పటిష్టమైన నిఘా ఉంటుందని ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రూరల్ డీసీపీ అజిత, ఏలూరు ఏఎస్పీ భాస్కర్‌రావు, భద్రాద్రి జిల్లా ఓఎస్డీ సాయిమనోహర్, అడిషనల్ డీసీపీ కేఆర్ కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయాన సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు రెండు రాష్ట్రాల అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, 24గంటల పాటు నిఘా ఉండేలా చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు జారీ అయిన నిందితులను కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఏసీపీలు బి.రామానుజం, గణేష్, ప్రసన్నకుమార్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ఉద్యోగిపై దాడి

భద్రాచలంటౌన్: భద్రాచలం రామాలయంలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కొందరు దాడి చేసిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. వ్యక్తిగత కారణాలతో ఉద్యోగిపై అతడి బంధువులు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కారం చల్లి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : పెద్ద నల్లబెల్లి, చిన్న నల్లబెల్లి, బండిరేవు, బైరాగులపాడు, సీతానగరం గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు, రూట్ వాచ్ నిర్వహించారు. నాటుసారా తరలిస్తున్న సుజ్ఞానపురానికి చెందిన భూక్యా బాబురావు, భూక్యా శ్రీకాంత్‌లను అరెస్ట్ చేశారు. 100 లీటర్ల నాటు సారా, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లుఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ తెలిపారు.

టేకు కలప సీజ్

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను భద్రాచలం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ మహీంద్రా జైలో వాహనం ఆగకుండా వెళ్లింది. దీంతో అధికారులు వెంబడించి పట్టుకున్నారు. తనిఖీ చేసి 6 టేకు దుంగలతోపాటు వాహనాన్ని కూడా సీజ్ చేశారు. చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఏపీలోని నెల్లిపాక నుంచి పాల్వంచకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎఫ్‌ఆర్‌ఓ రజిత తెలిపారు. కేసు నమోదు చేశామని, దుంగల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: వివాహిత అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన వివాహిత మనుగొండ వెంకటలక్ష్మి ఈ నెల 19న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత కక్షలతోనే హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణమూర్తి

ఇల్లెందు: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన మారుతి శ్రీనివాస్ అనే వ్యక్తిని పాత కక్షలతోనే హత్య చేశారని ఇల్లెందు డీఎస్పీ ఎస్‌వీ.రమణమూర్తి తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ఈ నెల 19న బొజ్జాయిగూడేనికి చెందిన మారుతీ శ్రీనివాస్ చేను వద్దకు వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఫోన్ కూడా లిఫ్ట్ చేయకపోవటంతో స్థానికులు, కుటుంబ సభ్యులు చేను వద్దకు బయల్దేరారు. ఈ క్రమంలో మార్గంమధ్యలో జాయాయిల్‌తోట వద్ద రోడ్డు పక్కన బైక్ పడిపోయి ఉంది. సమీపంలో రక్తపు మరకలు కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని సమీప జామాయిల్ తోటలో వెతకగా చెట్ల పొదల్లో శ్రీనివాస్‌ను హత్య చేసి పడేశారు. జాగిలాలతో పాటు కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కె.వెంకటేష్, లారీ క్లీనర్లు పి.రోహిత్, ఎం.నరేందర్‌లు మద్యం మత్తులో చేను వద్దకు వెళ్తున్న శ్రీనివాస్‌ను మాటు వేసి హతమార్చి, మృతదేహాన్ని జామాయిల్ తోటలో పడవేసినట్లు విచారణలో తేలింది. హత్యకు సహకరించిన మల్లేష్, నరేష్ అనే ఇద్దరు వ్యక్తులను కూడా అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ టి.కరుణాకర్ ఉన్నారు.

కేబుల్ చోరీ నిందితుల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న పోలీసులు

భద్రాచలంటౌన్: పట్టణంలో బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్ కేబుల్‌ను చోరీ చేసిన ఏడుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం.. పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైరులో మరమ్మతుల పేరుతో 75 మీటర్ల కేబుల్‌ను చోరీ, అందులోని రాగి వైరును విక్రయించారు. బీఎస్ఎన్ఎల్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా అండర్ గ్రౌండ్ కేబుల్ వర్క్ చేసే రాజమండ్రికి చెందిన వేముల రమణయ్య, గుంజా వెంకన్న, వేముల దుర్గారావు, వేముల యేసు, వేముల కనకరాజు, వేముల ఎర్రయ్యలను నిందితులుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసిన వైరును తొర్రూరులోని రమేష్ అనే వ్యక్తికి రూ.70 వేలకు విక్రయించినట్లు తెలిపారు. కేబుల్ విక్రయించిన సొమ్మును రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు ఏఎస్పీ తెలిపారు. సీఐ నాగరాజు రెడ్డి, ఎస్ఐ మధుప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇత్తడి చోరీ కేసులో..

కొత్తగూడెంటౌన్: చోరీ కేసులో ముగ్గురు నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. తన ఇంట్లో చోరీ జరిగిందని సింగరేణి ఆస్పత్రికి ఏరియాకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఇల్లపు అప్పారావు ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులైన చిగురుమల్లి వినయ్‌బాబు, కడలి చంద్రశేఖర్, సుంకెనపల్లి దీపక్‌లను అరెస్ట్ చేశారు. విచారణ చేపట్టి వారి నుంచి రూ. 30 వేల విలువైన ఇత్తడి, రాగి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

టీవీ చోరీ కేసులో..

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి హైస్కూల్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 1న గుండెపుడి హైస్కూల్‌లోని డిజిటల్ టీవీని అదే గ్రామానికి చెందిన రాజేష్, వెంకటేశ్వరరావు అనే వ్యక్తులు అపహరించారు. మరుసటి రోజే గ్రామకూడలిలో వదిలేసి వెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో రిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

ఏపీలో 'ఇంగ్లిష్' విద్యావిధానం భేష్

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్‌లో ఇంగ్లిష్ విద్యకు అక్కడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని సినీనటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అభినందించారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీలో ఇంగ్లిష్ మీడియం అమలును ప్రశంసించారు. ఇదే తరహా విధానాన్ని దేశవ్యాప్తంగా కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాతృభాష తెలుగు అయినా.. మనుగడ భాష ఇంగ్లిష్ అన్నారు. మన జీతం, జీవితం ఇంగ్లిష్‌తోనే ముడిపడి ఉంటుందన్నారు. గ్రామం మొదలు ప్రపంచం వరకు గ్లోబలైజేషన్ అయిననేపథ్యంలో అందరూ ఆంగ్లం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య ద్వారా సామాజిక న్యాయం దక్కుతుందని, ఇంగ్లిష్ విద్య శక్తిమంతమైందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీలు మహిళా బిల్లులో ఎందుకు పాల్గొనలేదు?

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశ సమయంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ నిలదీశారు. మహిళలను కాంగ్రెస్ పార్టీ చులకనభావంతో చూస్తుందని శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ కోసం ప్రధానమంత్రికి తెలంగాణ సీఎం కేసీఆర్ లేఖ రాశారని, దేశంలోని అన్ని పార్టీలకు ఎమ్మెల్సీ కవిత లేఖలు రాసి మద్దతు కూడగట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం బిల్లు పార్లమెంట్‌లో ఓటింగ్‌కు వచ్చినప్పుడు ఓటు వేయకుండా దొడ్డిదారిలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు బయటకు వచ్చారన్నారు.

బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీని అనర్హుడిగా ప్రకటించాలి: బీఎస్పీ


సాక్షి, హైదరాబాద్: బీఎస్పీ ఎంపీ కున్వర్ డానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీని వెంటనే లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని తెలంగాణ బీఎస్పీ డిమాండ్ చేసింది. బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సాంబశివగౌడ్, అరుణ, మైనారిటీ విభాగం కన్వీనర్లు అబ్రార్ హుస్సేన్ ఆజాద్, మౌలానా షఫీ మసూది పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు.

అంతా కనికట్టు

మఖిలో పుట్టి పుబ్బలో మాయమైన డొల్ల కంపెనీలు

- కేవలం స్కిల్ స్కాం డబ్బులు తరలించడానికే ఏర్పాటు
- స్కిల్ ఒప్పందం కుదిరిన నాలుగు రోజుల్లోనే రూ.లక్ష మూల ధనంతో పీవీఎస్పీ–స్కిలర్ కంపెనీ ఏర్పాటు
- ఆర్వోసీ బ్యాలెన్స్ షీట్లలో బయటపడ్డ స్కిలర్ బాగోతం
- ఏ అనుభవం లేని ఆ కంపెనీకి రూ.241.49 కోట్లు బదిలీ
- విలువైన పరికరాలు సరఫరా చేసినట్లు దొంగ ఇన్వాయిస్‌ల సృష్టి
- 2014లో ఏర్పాటైన ఇన్‌వెబ్, పాట్రిక్ ఇన్ఫో, భారతీయ గ్లోబల్ కంపెనీలు 2018 తర్వాత మూత
- ఆర్వోసీలో నమోదు కాని కంపెనీల పేరిటా బిల్లులు చెల్లింపు





2018 తర్వాత నుంచి భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్న ఆర్వోసీ రికార్డులు

సాక్షి, అమరావతి: నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ పేరుతో డబ్బులు కొట్టేయడానికి టీడీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో అడుగులు వేశారు. స్కిల్ సెంటర్స్ పేరుతో డొల్ల కంపెనీల ద్వారా డబ్బు ఎలా తరలించాలో ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకున్న తర్వాతే ఏపీఎస్ఎస్‌డీసీని తెరపైకి తెచ్చి.. సీమెన్స్ ముసుగులో ఒప్పందం చేసుకున్నారు. ఎటువంటి పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్లు దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించి రూ.241 కోట్లు కాజేశారు. ఈ బాగోతమంతా ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఎస్టీ ఇంటెలిజెన్స్, సెబీ, ఫోరెన్సిక్ ఆడిట్స్‌లో పక్కా ఆధారాలతో బయటపడింది. ఇందుకోసం అప్పటికప్పుడు కొన్ని షెల్ కంపెనీలను పుట్టించగా, హవాలా మార్గంలో నగదును సరఫరా చేసే కొన్ని షెల్ కంపెనీలను ఎంచుకున్నారు. మొత్తం ఈ కుంభకోణంలో సీమెన్స్ ముసుగులో డిజైన్‌టెక్ కీలకంగా వ్యవహరించింది. డిజైన్ టెక్ నుంచి రెండు షెల్ కంపెనీలకు మొత్తం నగదును పంపించి, అక్కడ నుంచి అనేక షెల్ కంపెనీల ద్వారా తిరిగి ఆ నగదు చంద్రబాబు సూచించిన వ్యక్తులకు చేరినట్లు దర్యాప్తులో షెల్ కంపెనీల ప్రతినిధులు అంగీకరించారు.

రూ. లక్షతో రూ. 241 కోట్లు

నగదును తరలించడం కోసం స్కిలర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో పీవీఎస్పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్ట్‌గా పిలిచేవారు) పేరుతో ఒక డొల్ల కంపెనీని అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే 2015 మార్చి30న స్కిలర్ కంపెనీని ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) డేటా స్పష్టం చేస్తోంది. న్యూఢిల్లీ కేంద్రంగా ప్రతిక్ రమన్‌భాయ్ పటేల్, అబ్దుల్ రఫుల్ హాయ్ కేవలం లక్ష రూపాయల మూల ధనంతో స్కిలర్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఎటువంటి అనుభవం లేని ఈ కంపెనీకి ఏకంగా రూ.241.49 కోట్ల విలువైన హార్డ్‌వేర్ పరికరాలను సరఫరా చేసే కాంట్రాక్టును అప్పగించారు. 717 దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించి వాటి ద్వారా డబ్బులు కొట్టేశారు. స్కిలర్ కంపెనీ 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఈ స్కిల్ ల్యాబ్స్‌కు రూ.241.49 కోట్ల విలువైన హార్డ్‌వేర్ పరికరాలను సరఫరా చేసి డబ్బులు తీసుకున్నట్లు దొంగ రికార్డులు సృష్టించారు. కానీ ఆ వివరాలను ఎక్కడా ఆ కంపెనీ అకౌంట్స్‌లో చూపించలేదు. 2016–17 సంవత్సరానికి స్కిలర్ కంపెనీ ఆర్‌వోసీకి సమర్పించిన ఆర్థిక స్టేట్‌మెంట్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ సంవత్సరంలో కేవలం రూ.99.03 కోట్ల విలువైన పరికరాలు మాత్రమే సరఫరా చేసినట్లు దొంగ లెక్కలు చూపించారు. వాస్తవానికి ఒక్క రూపాయి విలువైన పరికరాలు కూడా సరఫరా చేయలేదు. స్కిల్ కుంభకోణంపై సీఐడీ విచారణ ప్రారంభించిన తర్వాత స్కిలర్ తన దుకాణం మూసేసినట్లు ఆర్వోసీ రికార్డులు సూచిస్తున్నాయి. 2021లో చివరిసారిగా బ్యాలెన్స్ షీట్లు సమర్పించిన స్కిలర్ గత రెండేళ్ల నుంచి ఎటువంటి సమాచారాన్ని ఆర్వోసీకి ఇవ్వడం లేదు.

డబ్బులు వచ్చాక దుకాణం బంద్

స్కిలర్ చేతికి వచ్చిన రూ.241.49 కోట్లను పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్, ఐటీ స్మిత్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి అనేక డొల్ల కంపెనీల ద్వారా చంద్రబాబు గూటికి తరలించేశారు. ఈ కంపెనీలు కేవలం స్కిల్ కుంభకోణం సమయంలో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాయని, ఆ తర్వాత పని చేయలేదని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రూ.లక్ష మూలధనంతో 2012లో న్యూఢిల్లీ కేంద్రంగా ఏర్పాటైన ఇన్‌వెబ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల కంపెనీని 2016లో నగదు తరలించిన తర్వాత మూసేశారు. 2016లో చివరిసారిగా బ్యాలెన్స్ షీట్ సమర్పించిన ఈ కంపెనీ ఆ తర్వాత నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ప్రస్తుతం ఇది మూతపడిన కంపెనీగా ఆర్వోసీ రికార్డుల్లో పేర్కొన్నారు. మరో డొల్ల కంపెనీ పాట్రిక్ ఇన్ఫో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా న్యూఢిల్లీ కేంద్రంగా రూ.లక్షతో మొదలైంది. స్కిల్ కుంభకోణం నిధుల తరలింపు పూర్తయిన తర్వాత 2018లో ఈ కంపెనీ మూతపడింది. 2018 తర్వాత ఈ కంపెనీ ఎటువంటి బ్యాలెన్స్ షీట్లను సమర్పించలేదని, ప్రస్తుతం ఈ కంపెనీ మూసివేసిన కంపెనీగా ఆర్వోసీ రికార్డుల్లో చూపిస్తోంది. రూ.లక్షతో న్యూఢిల్లీ కేంద్రంగా ప్రారంభమైన భారతీయ గ్లోబల్ ఇన్ఫో మీడియా లిమిటెడ్ 2018 డిసెంబర్ 10 తర్వాత నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని ఆర్వోసీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అంటే ఈ డొల్ల కంపెనీలన్నీ నగదు తరలించాక కనుమరుగయ్యాయని స్పష్టమవుతోంది. ఇలా దొంగ ఇన్వాయిస్‌లతో నగదును తరలించడమే కాకుండా, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కోరుతూ దరఖాస్తు చేయడంతో పుణేలోని జీఎస్టీ ఇంటెలిజెన్స్ రంగంలోకి దిగి తీగ లాగితే మొత్తం డొంకంతా బయట పడింది.

హవాలా నగదు తరలింపులో ఏసీఐ దిట్ట

అల్లైయిడ్ కంప్యూటర్స్ ఇంటర్నేషనల్ (ఆసియా) లిమిటెడ్ (ఏసీఐ) నకిలీ ఇన్వాయిస్‌లతో నగదును తరలించడంలో దిట్ట. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన ఈ కంపెనీకి ఈ విషయంలో పెద్ద రికార్డే ఉంది. 2013–14 నుంచి 2019–20 వరకు ఈ కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌ను పరిశీలిస్తే స్కిల్ కుభంకోణం సమయంలో ఏసీఐ ద్వారా ఎంత నగదు తరలించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కుంభకోణం ముందు, తర్వాత ఏడాదికి రూ.లక్షల్లో మాత్రమే ఆదాయాన్ని చూపిన ఈ కంపెనీ.. కుంభకోణం సమయంలో రూ. కోట్లల్లో ఆదాయం చూపించడం గమనార్హం. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం అంటే 2015–16లో రూ.30.52 కోట్లు, 2016–17లో రూ.35.77 కోట్లు, 2018–19లో రూ.9.77 కోట్లు ఆదాయాన్ని చూపించిన ఈ కంపెనీ 2019–20కి వచ్చే సరికి కేవలం రూ.2 లక్షల ఆదాయాన్ని మాత్రమే చూపించింది. ఈ కంపెనీ లావాదేవీలపై అనుమానం వచ్చిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా 2017లో రంగంలోకి దిగి విచారణ ప్రారంభించింది. ఈ విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా సెబీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ వారికి సమాచారమిస్తే వారు ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ సందర్భంగా కంపెనీకి, కంపెనీ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేయగా, వారు నిజాలను ఒప్పేసుకున్నారు. ఎటువంటి వస్తువులు సరఫరా చేయకుండానే చేసినట్లు ఇన్వాయిస్‌లు సృష్టించి డిజైన్ టెక్ నుంచి నగదును తీసుకొని వాటిని వివిధ రూపాల్లో తిరిగి వారికే ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఏసీఐ ఎండీ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేశారు. వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పేరుతో రూ.241 కోట్లు డొల్ల కంపెనీల ద్వారా కొట్టేస్తూ సాక్ష్యాలతో బయటపడినా టీడీపీ మీడియా మా బాబు నిప్పు అంటూ అడ్డగోలుగా వాదనలు చేయడం వారికే చెల్లింది.

విశాఖ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి
- నీతి ఆయోగ్ గ్రోత్ హబ్స్ జాబితాలో వైజాగ్‌కు చోటు



సాక్షి, విశాఖపట్నం: నీతి ఆయోగ్ గ్రోత్ హబ్స్ జాబితాలో విశాఖపట్నం ఎంపికైన నేపథ్యంలో అభివృద్ధికి అవసరమైన భవిష్యత్ ప్రణాళికల్ని రూపొందిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, టూరిజం ఆర్‌డీ శ్రీనివాస్ పాణి, మెట్రోరైల్ ఎండీ యూజేఎం రావు తదితరులతో మాట్లాడారు. విభాగాల వారీగా విశాఖలో చేపట్టనున్న ప్రాజెక్టులు, ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల స్థితిగతుల్ని అడిగి తెలుసుకున్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, బహుళ ప్రాజెక్టులతో విశాఖ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి, మెట్రో రైలు కారిడార్ గురించి పీపీటీ ద్వారా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లు వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టు నాలుగు విభాగాలుగా రూపొందుతోందని మెట్రో ఎండీ యూజేఎంరావు తెలిపారు. మొదటి విభాగంలో స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు, రెండోది గురుద్వార జంక్షన్ నుంచి పోస్టాఫీస్ వరకు, మూడోది తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు, నాలుగోది కొమ్మాది నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 76.90 కి.మీ. మేర వేస్తున్నట్టు చెప్పారు. లైట్ కారిడార్, మోడరన్ కారిడార్ పేర్లతో రూపొందుతున్న మెట్రో రైలు ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని జవహర్‌రెడ్డి సూచించారు. అనంతరం జవహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అర్బన్ గ్రోత్ హబ్ సిటీస్ జాబితాలో విశాఖ చోటు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా వెలుగొందాలంటే అర్బన్ సిటీస్ గ్రోత్ సెంటర్స్ ముఖ్యమని నీతి ఆయోగ్ గుర్తించిందని తెలిపారు. ఇందుకోసం నీతి ఆయోగ్ బృందం టోక్యో, న్యూయార్క్ వంటి 20 ప్రపంచస్థాయి నగరాల్ని అధ్యయనం చేసి రోడ్‌మ్యాప్ సిద్ధం చేసిందని, ఇందులో భాగంగా విశాఖని ఎంపిక చేసిందని వివరించారు. విశాఖ నుంచి ముఖ్యమంత్రి పరిపాలనపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామని సీఎస్ చెప్పారు.

జిల్లా వార్తలు

విద్యార్థులకు హైకోర్టు జడ్జి దంపతుల చేయూత



విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న రాధాపరమేశ్వరి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్, రాధాపరమేశ్వరి దంపతులు రగ్గులు అందజేశారు. పాఠశాలలోని 100మంది విద్యార్థులకు రూ.30వేల విలువ చేసే రగ్గులను న్యాయమూర్తి సతీమణి రాధాపరమేశ్వరి శనివారం అందజేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాక ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీతతో పాటు అన్నపూర్ణ, సుధాకర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేసేందుకు ఆదివారం పోటీలు నిర్వహించనున్నారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఈ పోటీలు జరుగుతాయని నెట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి కె.ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే వారితో ఎంపిక చేసిన జిల్లా జట్టు ఈ నెల 30 నుంచి మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 11గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీ భక్తుల విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు శనివారం విరాళం అందజేశారు. ఎర్రగుంటకు చెందిన కల్లూరు ఓబుల్‌రెడ్డి–వెంకటలచ్చుమమ్మ దంపతులు రూ.50,116ను ఆలయ అధికారులకు అందజేయగా వారు దాతలకు రశీదు ఇచ్చి స్వామి దర్శనం చేయించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తోట దాటని పుచ్చకాయ

- కొనే దిక్కు లేక రైతు ఆవేదన
- సంతల్లో తిరుగుతూ అమ్మకానికి ఆపసోపాలు
- దిగుబడి అద్భుతంగా ఉన్న వేళ దక్కని ఆదాయం



పడమటనర్సాపురంలోని తోటలో పుచ్చకాయలు (ఇన్‌సెట్) రైతు రాంబాబు



జూలూరుపాడు: భూమాతను నమ్ముకుని వ్యవసాయం చేసిన రైతుల పరిస్థితి దినదినగండంగా మారుతోంది. అతివృష్టి లేదంటే అనావృష్టితో పంటలు దెబ్బతినడం ఆనవాయితీగా మారింది. ఇవేమీ ఎదురుకాకుండా పంట దిగుబడి బాగున్న సమయంలో కొనే దిక్కులేక అవస్థ పడాల్సి వస్తోంది. ఇప్పుడు జూలూరుపాడు మండలానికి చెందిన ఓ గిరిజన రైతు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. మండలంలోని పడమటనర్సాపురానికి చెందిన గుగులోత్ రాంబాబు ఎకరం రూ.35 వేలు చొప్పున ఐదు ఎకరాలకు రూ.1.75లక్షలు చెల్లించి కౌలుకు తీసుకున్నాడు. ఇందులో బొప్పాయి సాగు చేయగా, అంతర పంటగా బాహుబలి రకం పుచ్చ సాగు ఎంచుకున్నాడు. రెండు పంటలకు కలిపి సుమారు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాడు. జూలైలో అధిక వర్షాల కారణంగా రెండు ఎకరాల్లో పుచ్చ పంట పాక్షికంగా దెబ్బతిన్నా మిగతా మూడెకరాల్లో పుచ్చ పంట బాగానే పండింది. దిగుబడి సుమారు 60మెట్రిక్ టన్నుల మేరకు రాగా.. ఇంతలోనే మార్కెట్‌లో ధర పడిపోవడంతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు.

ధర లేక ఇక్కట్లు

మార్కెట్‌లో మెట్రిక్ టన్ను పుచ్చకాయలకు గతంలో రూ.5వేల నుంచి రూ.6వేల పలికింది. కానీ ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు కూడా చెల్లించడానికి వ్యాపారులు రావడం లేదు. దీంతో రైతు రాంబాబు పుచ్చకాయలను కోసి ఇంట్లో రాశి పోశాడు. వ్యాపారులు ముందుకు రాకపోవడంతో చేను వద్దే తక్కువ ధరకు అమ్ముతున్నట్లు రైతు వెల్లడించాడు. అలాగే, వివిధ చోట్ల జరిగే వారాంతపు సంతలకు వాహనాల్లో కాయలు తీసుకెళ్లి ఎంతో కొంతకు అమ్ముకుంటున్నాడు. కాగా, సివిల్ ఇంజనీర్‌లో డిప్లొమా పూర్తిచేసిన రాంబాబు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కింద చేపట్టిన అన్నారం బ్యారేజీలో ఉద్యోగిగా పనిచేశాడు. 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆయన ఆసక్తితో వ్యవసాయంలో నిమగ్నం కాగా, ప్రస్తుత పరిస్థితితో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాడు.

తెలంగాణ సంపదను దోచుకున్న కేసీఆర్..

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- కారేపల్లిలో ప్రారంభమైన ప్రజాపంథా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పక్కన నాయకులు

కారేపల్లి: ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకున్న సీఎం కేసీఆర్.. తన సంపదను మరింత పెంచుకునేందుకు మూడోసారి ముఖ్యమంత్రి అయ్యేలా మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. కారేపల్లిలో ప్రజాపంథా జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని, తద్వారా రాష్ట్రం ఇప్పుడు రూ.2 వేల కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. దోపిడీ చేయాలనే ఆలోచన తప్ప తెలంగాణ సమగ్రాభివృద్ధికి కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు. కాగా, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించినా అమలుపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదని తెలిపారు. తద్వారా బిల్లు అమల్లోకి రాకుండా మరో 15 ఏళ్లు కాలయాపన చేయాలనే కుట్ర ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుండటంతో సామాన్యులు బతికే పరిస్థితి కరువైందని నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యా పరిరక్షణ కమిటీ జాతీయ నాయకుడు రమేశ్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు వివిధ అంశాలపై మాట్లాడగా నాయకులు గుర్రం మచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆర్.శివలింగం, వై.పుల్లయ్య, ఆవుల అశోక్, జి.రామయ్య, అర్జున్‌రావు, వెంకన్న, బందెల వెంకయ్య, ఝాన్సీ, శిరోమణి, మంగతాయి, శోభారాణి, ఆజాద్, గుమ్మడి సందీప్, తేజ్యానాయక్, వీరన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



సాయికృష్ణ, అధ్యక్షుడు



వినయ్‌కుమార్, కార్యదర్శి

ఖమ్మంరాపర్తినగర్: బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య(బీడీఎస్‌ఎఫ్) రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఖమ్మం ఖానాపురంలోని పూలే అధ్యయన వేదికలో జరుగుతున్న బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రతినిధుల మహాసభలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్ల సాయికృష్ణ, కార్యదర్శిగా గోపె వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దుబ్బేట ఆనంద్, కోశాధికారిగా పొడకంటి సుందరయ్య, సహాయ కార్యదర్శిగా ధనువేందర్‌తో పాటు 21 మందితో కమిటీని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు కె.పర్వతాలు, తోకల సంజీవ్, సాదు మాల్యాద్రి, పొడకంటి రాంబాబు, లిక్కి కృష్ణారావు, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ప్రధానోపాధ్యాయులతో సమీక్షిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రధాన సబ్జెక్టులకు అదనంగా సమయం కేటాయిస్తూ బోధించాలని తెలిపారు. విద్యార్థుల కోసం రూపొందించిన వర్క్‌బుక్‌లు, మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించాలని చెప్పారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో నిర్లక్ష్యం చేయొద్దు

కామేపల్లి: వ్యాధి నిరోధక టీకాల పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దని జాతీయ వ్యాధి నిరోధక టీకాల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ అఖిల్ సూచించారు. కామేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని రామకృష్ణాపురంలో శనివారం ఆయన వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులు వేస్తున్న టీకాలు, నిల్వ పద్ధతులపై ఆరా తీసిన ఆయన రికార్డులను సైతం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ దూప్‌సింగ్, సిబ్బంది ఉషారాణి, కమల, విజయ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ వర్క్‌షాప్‌లో తనిఖీ చేసిన సింగరేణి డైరెక్టర్



వర్క్‌షాపులో పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని మెయిన్ వర్క్‌షాపును డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్క్‌షాపులో తయారుచేసిన కన్వేయర్ రోలర్లు, రూఫ్ సపోర్ట్ సామగ్రిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ.. వర్క్‌షాపులో ఉత్పత్తి ప్రక్రియలో వేగం పెంచాలని, నాణ్యమైన విడిభాగాలు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. గనుల నుంచి బొగ్గు రవాణాకు ఉపయోగించే కన్వేయర్ రోలర్లను 50 శాతం మెయిన్ వర్క్‌షాపులో ఉత్పత్తి చేస్తుండగా, వీటి సంఖ్య మరింత పెంచాలని తెలిపారు. అనంతరం అప్రెంటిస్ విద్యార్థులతో మాట్లాడి సూచనలు చేశారు. సెంట్రల్ వర్క్‌షాపు జీఎం దామోదరరావుతో పాటు అధికారులు ఎస్.జగన్‌మోహన్‌రావు, కేవీరావు, పి.రాజీవ్‌కుమార్, నరేశ్‌బాబు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణమే అమలుచేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్/తిరుమలాయపాలెం: పార్లమెంట్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి డిమాండ్ చేశారు. రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలుచేయాలనే డిమాండ్‌తో ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతా శనివారం ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం, తిరుమలాయపాలెంతో పాటు ఖమ్మం నగరంలో కొనసాగింది. ఈ సందర్భంగా అరుణజ్యోతి మాట్లాడుతూ.. మణిపూర్ ఘటన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. అందుకే ఆమోదంతోనే సరిపెట్టి అమలుపై జాప్యం చేయాలని చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతి, నాయకులు బుగ్గవీటి సరళ, మెరుగు రమణ, మెహరున్నీసాబేగం, ఎస్కే బీబీ, సుమతి, అమరావతి, బేబీ, భాగం అజిత, కళమ్మ, సుమతి, శోభారాణి, అఫ్రోజ్, సమీనా, పద్మ, ప్రభావతి, ముత్తమ్మ, ఆర్.కృష్ణవేణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.